నమ్మకమను రెండు నయనంబులే లేని
అంధులైరి మనుజులవనియందు
తాము చూడకున్న దైవంబు లేడా కా
తనకు లేడుగాని మనకు లేడె!

ప్రేమ స్వరూపులారా!

అనాది కాలము నుండి దైవము ఉన్నాడని కొందరు లేడని మరికొందరు వాదప వాదములు చేస్తూ విలువైన కాలమును వ్యర్థము గావిస్తున్నారు. కన్నులు లేని వానికి ప్రకాశించే సూర్యుడు కానరాడు. కన్నులు మూసుకున్న వానికి ప్రపంచమే కనిపించదు. అంత మాత్రముచే వారికి సూర్యుడు లేడనా? ప్రపంచము లేదనా? కాదు. కాదు. సూర్యుడున్నాడు. కాని దృష్టి లేదు. ప్రపంచముంది కానీ కన్నులు మూసుకున్నాడు. ఇది మన దృష్టి దోషమే గాని మరొకటి కాదనే సత్యము స్పష్టమవుతుంది. నమ్మకము మానవునికి ప్రధాన ప్రాణము. నమ్మకమే లేకుండిన క్షణమైనా కాలము గడుపలేరు. నమ్మకము లేకుండ పది అడుగులు కూడ ముందుకు పోలేడు. నమ్మకము లేకుండిన ఏ చిన్న కార్యము కూడా చేయలేడు. ప్రయత్నమే చేయలేని మానవుడు విజయము ఏవిధముగా సాధించగలడు. కనుక ఈ విశాల ప్రపంచములో ఏ చిన్న కార్యము సాధించవలెనన్న నమ్మకము చాలా ప్రధానము.

ఒక్క దైవ విషయమందే కాదు అన్ని రంగములందు నమ్మకం చాలా ప్రధానమైనది. ప్రతి విషయం తన విశ్వాసముపై ఆధారపడి ఉన్నది కాని పరులపైన కాదు. ఈ విశాల ప్రపంచమందు ఏ కార్యము సాధించవలెనన్న నైతికంగా, భౌతికంగా, లౌకికంగా, ఆధ్యాత్మికంగా నమ్మకంతోనే మనము కార్యము సాధించగలుగుచున్నాము. ఈ నమ్మకము చేతనే మనము సర్వులను ప్రేమిస్తున్నాము. ఈమె నా తల్లి అనే నమ్మకము లేకపోతే తల్లిని కూడా మానవుడు ప్రేమించలేడు. ఈమె నా భార్య అనే నమ్మకం లేకపోతే ఆమెను భర్త ప్రేమించలేడు. ఇది నా బిడ్డ అనే నమ్మకం లేకపోతే తల్లి బిడ్డను ప్రేమించలేదు. ఇట్టి సర్వవ్యాపకత్వమైన ప్రేమతత్త్వాన్ని నమ్మకం చేతనే అనుభవిస్తున్నారు

గాని నమ్మకం లేకపోతే దేనిని మీరు అనుభవించలేరు.

అనేకమంది ఈ నమ్మకము కోల్పోయి నమ్మకం లేకపోయినా ఉన్నట్లుగా నటించే జనులే లోకంలో అధికంగా ఉంటున్నారు. కాని దైవ విషయం వచ్చేటప్పటికి తమ హృదయంలో విశ్వాసం ఉన్నప్పటికి బయట ప్రపంచములో పేరు ప్రతిష్టల నిమిత్తమై లేక పార్టీల నిమిత్తమై భగవంతుడు లేడని ఉచ్చరిస్తున్నారు. భగవంతుడే నిజంగా ఉంటుంటే ఎందుకు కన్పించడు! కనిపించని వన్ని నీవు విశ్వసిస్తున్నావా? ఉదయం MBA పిల్లల దగ్గర ఒక ప్రశ్న వచ్చింది. స్వామి చెప్తుంటారు అందరిని ప్రేమించమని. ఎందుకు అందరిని ప్రేమించాలి అని. నేను దానికి ప్రతి ప్రశ్న వేశాను. ఎందుకు ప్రేమించాలి అని నీవు అనుకుంటున్నావుగాని ఎందుకు ద్వేషించాలి? ద్వేషించటానికి ఏ కారణమో ప్రేమించటానికి అదే కారణము. ద్వేష ప్రేమలు రెండు బింబ ప్రతిబింబములే. ఎక్కడ లేదు అనే భావము ఉంటుందో అక్కడ ఉన్నది అనే సత్యం ఉంటుంది. ఒక చిన్న ఉదాహరణ. ఇప్పుడు స్టేజిపై సాయిబాబా ఉన్నాడా లేడా? ఉన్నాడు. దేనిని బట్టి? రూపాన్ని బట్టి చెబుతున్నారు. ఈ ఉపన్యాసం అయిన తరువాత నేను లోపలకు వెడతాను. అప్పుడు సాయిబాబా స్టేజిపై ఉన్నాడా? లేడు. ఉన్న వస్తువునే లేదు అని చెబుతున్నాడు. సాయిబాబాయే లేకపోతే ఉన్నాడు లేడని ప్రశ్నరాదు. అక్కడ అదే విధముగా దేవుడు ఉండబట్టే ఉన్నాడు లేడు అని రెండు పదములు వస్తున్నాయి. దేవుడు ఉండినప్పుడే లేడనే పదము వస్తుంది. There is God అంటున్నాడు అనీల్ కుమార్. మొట్టమొదట సత్యము ప్రారంభమవుతుంది. There is అంటున్నాము. ఎవ్వడు ఉన్నాడు who ఎవరు? God. అయితే దాని తరువాత There is no God అంటాడు. no God తరువాత వస్తుంది. కాబట్టి సత్యమే మొదట వస్తుంది. no God తరువాత వస్తుంది. ఇంకా నాస్తికత్వము బాగా పెరిగిపోయినప్పుడు మరొక పదము దానికి ప్రారంభమవుతుంది. God is nowhere. God is nowhere అని నాలుగు పదములు. no ను w లో చేర్చితే now here అయిపోతుంది. ఇక్కడ ఉన్నది అక్కడ చేర్చాము. భావము ననుసరించి నమ్మకముండినప్పుడు now here అంటాము. నమ్మకం లేనప్పుడు no where అంటాము. రెండింటికీ నమ్మకమే మూలకారణము. నమ్మకమే మానవుని నేత్రములు. ఈ నేత్రములే మానవుని శాస్త్రములు. ఈ శాస్త్రముల దృష్టియే ఈ సృష్టి. ఈ సృష్టియే మానవుని దృష్టి. కనుక దృష్టికి సృష్టికి ఏమాత్రం భేదము లేదు. నేత్రములకు శాస్త్రములకు ఏ భేదము లేదు. నేత్రములతో చూచిన దానినే

07079603

శాస్త్రములలో వర్ణిస్తున్నాము. శాస్త్రములలో వర్ణించినదానినే నేత్రములతో చూస్తున్నాము.

కనుకనే భగవంతుని మొట్టమొదట జ్ఞానం తెలుసుకోవాలి. తెలుసుకున్న దానిని ద్రష్టం. చూడాలి. చూచిన దానిని ప్రవేష్టం లోపల ప్రవేశింప చేసుకోవాలి. ఫలాని వస్తువు మార్కెట్టులోకి వచ్చిందని వినాలి. శ్రవణం చేయటం జ్ఞానం. వస్తువును మార్కెట్టుకు వెళ్ళి చూడాలి. ద్రష్టం. చూచినంత మాత్రమున అది పొట్టలో ప్రవేశించదు. ప్రవేష్టం. ఆ చూచిన దానిని లోపల ప్రవేశపెట్టాలి. దీనినే శ్రవణం, మననం, నిధిధ్యాసయు అంటారు. శ్రవణము చేయాలి. శ్రవణము చేసినదానిని మననం చేయాలి- మననం చేసినదానిని ప్రాక్టికల్ లో పెట్టాలి. నవవిధ మార్గములలో మొట్టమొదటిది శ్రవణము. చివరిది ఆత్మ నివేదనం. అనేకమంది ఇక్కడికి వచ్చి స్వామిని చూస్తూ ఉంటారు. వారి వారి గ్రామములకు వెళ్ళి విన్నదంతా వారు చెప్తుంటారు. సాయిబాబా చూశామని ప్రశాంతినిలయం ఇట్లున్నదని అట్లున్నదని చెప్తారు. ఇదంతా శ్రవణం చేయటం వలనే కదా రెండవ వారికి చెప్పగలుగుతున్నారు. శ్రవణమే చేయకపోతే చెక్కట్టా కానరు వారు. శ్రవణము చేతనే సర్వకార్యములు నెరవేరుతున్నాయి. కనుక ప్రతి మానవునకు మొట్టమొదట విశ్వాసం అవసరం. విశ్వాసము లేకపోతే వారికి జీవితమే ఉండదు. కనుక ప్రతి మానవుడు విశ్వాసముతో తన జీవితమును ప్రారంభించాలి. అయితే కొంతమంది విశ్వసించరు. విశ్వసించని వారి గతి వారిదే. నీకెందుకు వారి గురించి విచారము? ఎవరికి ఇష్టమైందో వారు కొనుక్కుంటారు. అంతేగాని వారినేమాత్రం బాధించకూడదు.

ఎస్ అనువారికి ఎస్ అనురా
నో అనువారికి నో అనురా
నో ఎస్‌లు నీ నోటికే గాని
సాయికి సర్వము ఎస్ ఎస్ ఎస్

నీ నో, ఎస్ లు నీ నోటికే గాని దైవమునకేమీ సంబంధము లేదు. ఏ నాలుక నో అని చెప్పిందో ఆ నాలుక ఎస్ అని చెబుతుంది. రెండూ చెప్పేది ఒక నాలుకే. దేనిని నీవు నమ్ముతావు? నో ను నమ్ముతావా? ఎస్ ను నమ్ముతావా? కాదు.కాదు. నీ నాలుకను నీవు నమ్మాలి. రెండింటికి ఈ జిహ్వయే కారణం. కనుక జయదేవుడు నాలుకను

జిహ్వే రసజ్ఞే మధుర ప్రియత్వం సత్యం హితం త్వాం పరమం వదామి
ఆవర్ణయేథా మధురాక్షరాణి గోవింద దామోదర మాధవేతి.

ఈ గోవింద, దామోదర, మాధవ అనే పదములు ఎక్కడ ఆడుకుంటున్నాయి. మన నాలుకపైనే నాట్యమాడుతున్నాయి. నాలుక మాటలకు స్టేజి. స్టేజిపై మంచి బొమ్మలు ఉన్నాయి చెడ్డ బొమ్మలు ఉన్నాయి రాజు వస్తుంటాడు రాణి వస్తుంది. జవాను వస్తుంటాడు. ఈ నాలుక సాక్షీభూతమైనది. ఈ నాలుక లేకుండా ఉంటే మూగవాడు ఉండవచ్చు. ఏమేమో తీయని పదార్థములు తింటున్నాడు. చెప్పలేడు కాని ఆ తీపిని తాను అనుభవిస్తున్నాడు. పదములతో చెప్పలేడు కాని ఆ మాధుర్యమును స్వయంగా అనుభవించగలడు. అనుభవముతో మొదలుపెట్టి అనుభూతి పొందాలి. వాదోపవాదముల చేత నీవు కాలమును గానీ, కర్మను గానీ వ్యర్థము చేయరాదు. వాదించటం చేత వైరం పెరుగుతుంది గానీ ప్రేమ పెరగదు.

దైవమును నమ్మియే తీరాలి. దైవము లేడని వాదించటము మూర్ఖత్వము. ఏమి లేదంటున్నావు. కనిపించటం లేదు కాబట్టి లేదంటున్నావు. ఒక వ్యక్తి ఉన్నాడు. అతను ఆరడుగుల పొడవు, ఎనభై పౌండ్ల బరువు ఉన్నాడు. వైట్ కలర్ లో ఉన్నాడు. బట్టతల కలిగి ఉన్నాడు. ఇవన్నీ శరీరము యొక్క చిహ్నములు. ఆకారమును చూచి నీవు చూచినది సత్యం అనుకుంటున్నావు నీవు. ఆకారమును చూస్తున్నావు. ఇంతేనా మానవుని యొక్క విలువ. నీకు తెలియనివి, కనిపించనివి అతనిలో దయ ప్రేమ, ద్వేషము, సానుభూతి, సహనము ఇవన్నీ ఉంటున్నాయి. ఇవన్నీ నీకు కన్పించటం లేదు. అయితే అవి లేవని అనగలమా? కన్పించనివి అన్నీ లేవని మూఢంగా అంటున్నావు. ఏది కనిపించదో అదే ఈ మానవత్వాన్ని నిరూపిస్తూ వచ్చింది.

కనిపించనిదే వినిపించును
నీ కర్మల ఫలమును మర్మము జీవా.
హై హై హై హై బొమ్మా దీని
తమాషా చూడర మాయ బొమ్మా.

కనిపించేవి ఏమాత్రం మనకు కష్టసుఖములందించటం లేదు. కన్పించని గుణములే మనకు కష్టసుఖములు చేకూరుస్తున్నాయి. కనుక కనిపించనిది నమ్మకూడదనటం పెద్ద మూర్ఖత్వము. మన చుట్టూ గాలి ఉంది. గాలి మన కంటికి కనిపించటం లేదు. గాలి లేదని చెప్పగలమా? గాలి లేకుండా నీవు ఏరీతిగా జీవించగలవు? ఉంది గాలి. కానీ కనిపించదు. ఇదే నచికేతునకు ఉద్దాలకుడు బోధించిన ప్రబోధ. 'నాన్నా! దైవము ఎక్కడున్నాడు?' 'సర్వత్ర ఉన్నాడని వేదములు గానీ శాస్త్రములు గానీ

చెబుతున్నాయి. నాయనా! ఇది మాటలతో చెప్పేది కాదు. నీవు సాధన చేత, గురు కటాక్షము చేత
దైవానుగ్రహము చేత నీవు సత్యాన్ని గుర్తించవలసి వస్తుంది. దీనికి ఒక చిన్న ఉపమానం చూపిస్తాను
అన్నాడు. లోపలికి వెళ్ళి ఒక పాత్రలో నీరు కొంచెం చక్కెర తీసుకు రమ్మన్నాడు. అవి తీసుకు వచ్చాడు
ఈ నీరు ఉన్న పాత్రలో చక్కెర వేయమన్నాడు. ఉద్దాలకుడు బాగా కలిపాడు. కలిపే సరికి చక్కెర
కన్పించలేదు. ఏ చేతితో తెచ్చాడో ఆ చేతికే చిక్కటం లేదు. ఏ కన్నులతో చూచాడో ఆ కన్నులకే
కన్పించటం లేదు. అది కనిపించదు చేతికి ఏమాత్రం చిక్కదు. చక్కెర ఉంది అంతే ఈ జలము
లో సర్వత్రా కరిగిపోయింది. అదే రీతిగా దైవ సాక్షాత్కారం ఉంది. అయితే మానవుని యందు
అదమై ఉంటున్నది. నేత్రములను చర్మ చక్షువులకు కన్పించదు. కేవలం జ్ఞాన చక్షువులకే కన్పిం
స్తుంది. నీవు చూడటం చర్మ చక్షువులతో చూస్తున్నావు. జ్ఞాన చక్షువులతో చూడాలి. కనుక
ప్రత్యక్ష ప్రమాణమే ప్రధానమని అనుకోటం పెద్ద మూర్ఖత్వము.

పరోక్షం కూడా ఉంది. అగ్ని కనిపించదు కాని పొగ మాత్రం వస్తుంది. ఈ పొగను
చూసి అగ్ని ఉందనే నిర్ణయమునకు వస్తాము. అదే విధంగా దైవత్వమనేది లేకపోతే ఈ జగత్తులో
ఉండటానికి వీలు కాదు. చిన్న ఉదాహరణ. ఒక ఆవుకు దూడ పుట్టింది. పుట్టిన తక్షణమే ఆ తల్లి
తన నాలుక చేత ఆ దూడను పరిశుద్ధము చేస్తుంది. ఈ పరిశుద్ధము చేసిన తక్షణమే ఆ దూడ లేస్తుం
ది. అంతవరకు ఈ దూడ నిల్చునేందుకు ప్రయత్నించదు. ఆ పుట్టిన దూడకు ఆకలి అయినప్పుడు
పాలు ఎక్కడుంటాయి అనేది ఎవరు నేర్పించారు దానికి? తిన్నగా అదే నడచి పొదుగు దగ్గరకు పోయి
పాలు తాగుతుంది. ఇది ఎవరు నేర్పారు? అంతా దైవ నిర్ణయమే. ప్రతి ఒక్కటి అర్థము చేసుకోకుండా
మూర్ఖత్వము లో దైవము లేడని వాదిస్తామె కాని అనుకోటం పెద్ద మూర్ఖత్వము. ప్రత్యక్షంగా కనిపిం
చనివి అనుభూతికి వచ్చేవి ఎన్నో ఉన్నాయి. మనదానిని మనం చూసుకోవాలంటే next ఏ సంకల్పము
వస్తుందో మనకే తెలియదు. మంచి చెబితే వినరు. వినకపోవటం చేత మూర్ఖత్వము పెరిగిపోతు
న్నది. మన వాసనలు పోవటం లేదు. ఏమిటా వాసనలు? జన్మాంతరము యొక్క వాసనలుంటున్నాయి.
past life గురించి చెబితే మరెవరు నమ్మరు, మన నమ్మకంతో నాకెందుకు నా అనుభవము నాది
ది. నీవు నమ్మినా నమ్మకపోయినా అవి ఫలింప చేస్తున్నాయి. ప్రతి దానికి past, present, future
మూడూ ఉంటున్నాయి. ఈ past లేకుంటే present ఎలా వచ్చింది? పూర్వము past అనే వృక్షము
ఉన్నప్పుడే present అనే seed వచ్చింది. ఈ present అనే విత్తనం ఉండటం చేత future

అనే వృక్షము వస్తుంది. past tree, future tree, present seed. కాబట్టి ఇంత పెద్ద వృక్షము అంత చిన్న విత్తనంలో ఇమిడి ఉంది. దీనినే వేదాంతము 'అణోరణీయాన్ మహతో మహీయాన్ అణువులో అణువుగా ఘనములో ఘనముగా ఉన్నాడు.' మనకు కన్పించదు గాని అనుభూతులు అర్థమవుతాయి. ఇది ఒక గులాబి. ఇది కనిపిస్తున్నది. ఇది ఏమంటే గులాబి పుష్పమంటారు. దీని వాసన మనకు కన్పించదు గానీ అనుభూతికి వస్తుంది. ఈ వాసనకు రూపం లేదు కాని వాసన అందించే పుష్పమునకు రూపం ఉంది. ప్రేమకు రూపం లేదు కాని నిన్ను ప్రేమించే తల్లికి రూపము ఉంది. ప్రేమ, ఆనందము, సుగంధము వీటికి రూపము లేదు కాని వాటిని అందించే వాటికి రూపం ఉంది. రూపం ఉన్నది రూపం లేనిదానిని అందించగలుగుతున్నది.

నీ కన్నులను నీవు చూడగలుగుతున్నావా? నీవు చూడలేనప్పుడు నీవు కన్నులున్నాయని ఎలా చెప్పగలుగుతున్నావు? నీ ముందర ఒక అద్దము పెట్టుకుంటే నీ కన్నులు నీకు కనిపిస్తాయి. నీ మనస్సు అనుకుంటున్నావు. నీ మనస్సు ఏ రూపం ఉంది? నీ మనస్సు నీవు చూడగలుగుతున్నావా? కానీ నీవెలా నమ్ముతున్నావు. ఇవన్నీ కేవలము మూర్ఖత్వముతో కూడిన మాటలు. కనిపించనివి అన్నీ మనకి మూలాధారము. ఈ పెద్ద వృక్షము పూర్వం విత్తనంగా ఉన్నప్పుడు మనకు కనిపించటం లేదు ఆ చిన్న మొక్కే పెద్ద వృక్షంగా మారింది. దైవత్వము సర్వత్రా ఉండి కూడా కన్పించకుండా ఉంది. గాలి ఏ విధంగా సర్వత్రా ఉండి ఏ విధంగా మనకు కన్పించదో దైవం కూడా కన్పించకుండా ఉన్నాడు. పంచభూతములు అట్టివే. ఒక్కొక్క పంచభూతమునకు ఒక్కొక్క శక్తి ఉంటున్నది. దేహములో సర్వత్రా ఉండునది ఒక రక్తము. డాక్టర్లు blood test చేయాలంటే శరీరములో నున్న రక్తమంతా తీసి test చేయటం లేదు. ఒక చుక్క ఎక్కడనుండో తీస్తాడు. మంచి చెడ్డ నిర్ణయిస్తాడు. నాలుకపైనున్నది, పెదవులలో నున్నది అంతా రక్తమయం. కాని లడ్డును తీసుకొచ్చి చేతిపై పెడితే రుచి తెలుస్తుందా? తెలియటం లేదు. కానీ నాలుకపై పెడితే తెలుస్తుంది. ఒక్కొక్క దగ్గర ఒక్కొక్క విధమైన శక్తి మాత్రమే ఉంటున్నది. ఆ సత్యాన్ని గుర్తించలేని మూర్ఖులు సర్వత్రా కనిపించాలి కదా అంటారు. సర్వత్రా ఉన్నది ఒకే రక్తము కదా. ఇది నమ్ముతావా? లేదా? అయితే చేయి ఎందుకు taste చేయలేదు. ఒక్క నాలుకపైన పెడితేనే taste తెలుస్తుంది. ఒక్క నాలుకకు మాత్రమే ఆ గుణం ఉంది. కనుక దైవం ఉన్నది. ఉన్నది. దైవము లేక జగత్తు లేదు. నీ ఆత్మయే నీకు దైవము. దేవునిపైన నమ్మకము లేదంటే నీపై నీకు నమ్మకము లేదన్నమాట. తనను తాను నమ్మని వాడు దైవమును ఏరీతిగా నమ్మగలడు? మొట్ట

07079607

మొదట తనను తాను నమ్మాలి. మానవునకు విశ్వాసము శ్వాస. ఈ విశ్వాసము లేని వాడు కేవలం శవ స్వరూపుడు.

ఉదాహరణము. నిత్య జీవితములో మనము సత్యముగా అనుభవించేది. ఉచ్ఛ్వాస నిశ్వాసములుండినంతవరకు ఇది శివం. అనగా మంగళకరము. ఈ ఉచ్ఛ్వాస నిశ్వాసములు పోగానే శవం. ఏది శివం ఏది శవం? మన ప్రాణమే శివం. ప్రాణం లేకపోవటమే శవం. శివుడంటే గంగను నెత్తిమీద పెట్టుకొని త్రిశూలం పట్టుకొని శిల్పి చెక్కిన రూపాన్ని శివుడని అనుకుంటున్నాము. మన ప్రాణమే శివుడు. ఈశ్వర స్సర్వభూతానాం. ఈశ్వరుడు శ్వాసరూపుడై ఉంటున్నాడు. అలానే దైవము. కనుక దైవత్వము సర్వత్రా ఉంది. సర్వతీర్థములా మనం చూడటానికి వీలవుతుంది. ఒక అబ్బాయి చెప్పాడు ఉపన్యాసంలో సత్యంవద, ధర్మంచర అని. సత్యము పలకాలి. ధర్మములో ఆచరించాలి ఇది తేలిక కాదు చాలా కష్టం అన్నాడు. అది తప్పు. సత్యము పలకటం, ధర్మము నాచరించటం దీనికంటె తేలిక మరొకటి లేదు. సత్యము చెప్పటమంటే స్వామి నాలుగు గంటలకొస్తారు ముందుగా ఉపన్యాసం ప్రారంభించారని చెప్పటం సత్యం. ఉన్నది ఉన్నట్లుగా చెప్పటం ఎంత సులభం. దీనికి మాత్రం యోచన చేయనక్కరలేదు. విచారణ అక్కరలేదు. అసత్యంగా చెప్పాలంటే చాలా విచారణ చేయాలి. ఈ అసత్యాన్ని నమ్మకమైన రీతిగా దీనిని మార్చుకోవాలి. ఎన్నో కుయుక్తులు పలకాలి. అబద్ధం చెప్పటం ఎంత కష్టం. సత్యం పలకటం చాలా సులభము. సత్యం కష్టమనుకుంటున్నారు. చాలా పొరపాటు. అసత్యానికి అలవాటు పడ్డాము. ఈ అలవాటైన అసత్యం వల్ల సత్యం కష్టమనుకుంటున్నాం లోకము కూడా దీనికి అవకాశము ఇస్తూ వచ్చింది. ఈ బలహీనత ప్రతి మానవునిలో ఉంది. ఒక చిన్న ఉదాహరణ. ఒక ఇంటిలో ఒక వ్యక్తి మరణించాడు. అక్కడకు వెళ్ళి ఏమిటండి పుట్టటానికి ఏమి కారణమో గిట్టటానికి అదే కారణం. పుట్టాడు చచ్చాడు. జననంలో చావు మరణం కూడా ఉంటుందని మాట్లాడితే ఎవరితను ఇంత కఠినంగా మాట్లాడుతున్నాడు అని మనపై కోపం వస్తుంది వారికి. కానీ ఇంటికి పోయి అన్నా! ఏమి జబ్బు చేసింది? ఏ డాక్టరు చూశారు? ఏమి మందు ఇచ్చారు? ఎందుకింత ప్రమాదం జరిగిందని విచారిస్తే అయ్యో అతను వచ్చి క్షేమ సమాచారం విచారించి వెళ్ళాడని గొప్పగా చెప్పుకుంటారు. ఇదంతా అల్పతృప్తి. ఇవన్నీ మనం గుర్తించేవి కావు. జననంలో చావు మరణం కూడా ఉంటుంది. రైల్వే కంపార్ట్మెంటు మీద return అని వ్రాసి ఉంటుంది. ఆ కంపార్ట్మెంటు ఎక్కడికి పోయినా return అవవలసిందే. కాబట్టి

ఈ దేహము ఒక కంపార్టుమెంటు. కాన దీనిపై date వ్రాయబడదు కాని return మటుకు ఉంటుంది. కనుక దీనికి ఎందుకు విచారపడాలి. ఎందుకు దుఃఖమునకు గురికావాలి? మనము ఈ విధమైన దానికి మొదటి నుండి అలవాటు పడిపోయాము. కనుక ఇవన్నీ అలవాటులో వచ్చిన పొరపాటులే. కానీ విశ్వాసముతో వచ్చినవి కావు. విశ్వాసము అనేది సత్యం. సత్యమనేది విశ్వాసం. విశ్వాసము చేతనే మన కానందము. ఈ ఆనందము చేతనే శాంతి. శాంతి వలనే సౌఖ్యము. సౌఖ్యము వలనే సంతోషము. మన సంతోషమే మన స్వర్గము. మన దుఃఖమే మన నరకము. కనుక మనము దుఃఖమునకు ఏమాత్రము అవకాశము నివ్వక విశ్వాసముతో ప్రతిదానిలో పోరాడాలి. ఆ విశ్వాసముతో మనం ఏదైనా సాధించవచ్చు. ఈ విశ్వాసము లేనివాడు దేనిని సాధించలేడు. కనుక మొట్టమొదట నమ్మకము పెంచుకోవాలి. ఈ నమ్మకము దైవచింతన చేతనే కలుగుతుంది.